సాక్షి
నంద్యాల
శనివారం, 13, జనవరి, 2024



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.



ఖాదర్‌లింగ స్వామి వేడుకలు

ఖాదర్‌లింగ స్వామి జయంతి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. వేడుకలకు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 8లో▸



జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఎస్టీయూ వజ్రోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 8లో▸

న్యూస్‌రీల్

27 వేల మందికి వైద్య సేవలు



ఓపీ అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట రమణ

శిరివెళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 27 వేల మందికి వైద్య సేవలను అందించామని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని బోయిలకుంట్లలో జరిగిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండవ విడత కింద 447 శిబిరాలు నిర్వహించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 66 శిబిరాలు జరిగాయన్నారు. గ్రామాల్లో నెలలో మంగళ, శుక్రవారం, పట్టణాలలో బుధవారం సచివాలయాలలో వైద్య శిబిరాలు జరుగుతాయన్నాయన్నారు. ఆపరేషన్లు, కంటి పరీక్షలు, బీపీ, షుగర్‌లకు పరీక్షలు చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. శిబిరాలకు ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరవుతున్నారన్నారు. కాగా బోయలకుంట్ల శిబిరంలో 467 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు జింకల నాగన్న, ప్రోగ్రాం ఆఫీసర్లు జగదీశ్ చంద్రారెడ్డి, కాంతారావు, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర, స్పెషలిస్ట్ డాక్టర్లు, గాజులపల్లె పీహెచ్‌సీ డాక్టర్లు వెంకటరెడ్డి, దినేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు నాలుగు రోజుల సెలవులు

నంద్యాల(సెంట్రల్): సంక్రాంతి సందర్భంగా నంద్యాల మిర్చి యార్డుకు నాలుగు రోజుల పాటు వరుస సెలవులు వచ్చాయి. శని, ఆదివారాలు సాధారణ సెలవులతో పాటు సోమవారం సంక్రాంతి మంగళవారం కనుమ సందర్భంగా నాలుగు రోజులపాటు ప్రభుత్వం సెలవులు ప్రకటించినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో రైతన్నలెవరూ యార్డుకు మిర్చి సరుకు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

నేడు కర్నూలుకు ఏపీఈఆర్‌సీ చైర్మన్ రాక

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి శనివారం కర్నూలుకు రానున్నారు. ఏపీఈఆర్‌సీ రాష్ట్ర స్థాయి కార్యాలయం ఏర్పాటు అవుతోంది. కర్నూలులో డోన్ రోడ్డులోని కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంతంలో సొంత భవనాన్ని కూడా నిర్మిస్తున్నారు. భవన నిర్మాణపు పనులను జస్టిస్ నాగార్జునరెడ్డి పరిశీలిస్తారని కర్నూలు సర్కిల్ ఎస్ఈ ఉమాపతి తెలిపారు.

సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ఆలయ ధ్వజస్తంభంపై ధ్వజపటం

సకల దేవతలను ఆహ్వానిస్తూ.. ధ్వజారోహణ

ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద పతావిష్కరణ చేయడమే ధ్వజారోహణ. ఈ కార్యక్రమంలో ఒక కొత్తవస్త్రంపై పరమ శివుని వాహనమైన నందీశ్వరుని, అష్టమంగళచిత్రాలను చిత్రీకరిస్తారు. దీన్నే నందిధ్వజపటం అంటారు. ఈ నంది ధ్వజపటాన్ని ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి చండీశ్వర స్వామి సమక్షంలో పూజలు నిర్వహించారు. అలాగే భేరిపూజలో డోలు వాద్యానికి పూజలు చేశారు. అనంతరం నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ముక్కోటిదేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకుగాను ఈ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆలయ వేద పండితులు శాస్త్రోకంగా చేపట్టిన కార్యక్రమంలో ఈఓ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీగిరిలో పంచాహ్నికదీక్షతో శాస్త్రోక్తంగా ఉత్సవాలు ప్రారంభం
- నేటి నుంచి స్వామి అమ్మవార్లకు వాహన సేవలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నికదీక్షతో ఏడురోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అర్చకులు, వేదపండితులు, స్థానాచార్యులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సంప్రదాయాన్ని అనుసరించి మల్లికార్జునస్వామికి ఏటా మకర సంక్రమణం సందర్భంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి సందర్భంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ మేరకు శుక్రవారం



చండీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమ శాస్త్రానుసారంగా జరిపించారు. బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, ఆలయ అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం వేదపండితులు చతుర్వేదపారాయణలతో వేదస్వస్తి నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు. గణపతిపూజ, వృద్ధి, అభ్యుదయాల కోసం స్వస్తి పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం బ్రహ్మోత్సవ నిర్వహణకు అధ్వర్యం వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేషపూజలు జరిపారు. చండీశ్వర అర్చన తరువాత కంకణాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ ఈవో, అధికారులు, అర్చకులు, స్థానాచార్యులు కంకణాలు ధరించారు. అనంతరం రుత్విగ్వరణం, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధనలు, కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్ఠానములు, పారాయణలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత ప్రదేశంలోని మట్టిని సేకరించి సంప్రదాయబద్ధంగా యాగశాలకు తీసుకువచ్చి, ఆ మట్టిని 9 పాలికలలో (మూకుళ్లలో) నింపి దాంట్లో నవధాన్యాలు పోసి పూజలు నిర్వహించారు.



ధ్వజ పటావిష్కరణ చేస్తున్న ఈఓ, అర్చకులు



పుష్పాలంకరణలో ఆలయం

నేడు భృంగివాహనసేవ

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహిస్తారు. భృంగివాహనంపై ప్రత్యేకంగా అలంకరించిన స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి ప్రత్యేక పూజల అనంతరం గ్రామపురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి



సిబ్బంది నుండి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ

బొమ్మల సత్రం: పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందికి గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బందికి ఎదురయ్యే సమస్యలు పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అనుమానిత ఫోన్ కాల్స్‌తో జాగ్రత్త..

గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోలీసు డిపార్ట్‌మెంట్ వ్యక్తులమని, ఆసుపత్రిలో వున్నారని, అత్యవసరంగా డబ్బు కావాలని ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపితే మా కానిస్టేబుల్ ఒక గంటలో తిరిగి ఇస్తారని మాయ మాటలు చెప్పి నగదు కాజేస్తున్నారని ఇటువంటి వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ తరహా మోసాలు జిల్లాలో డోన్, ఆత్మకూరు, చాగలమర్రి, గడివేముల, బనగానపల్లెలో నమోదయ్యాయన్నారు. ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే నెంబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

శాస్త్రోక్తంగా కూడారై ఉత్సవం

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో ధనుర్మాస పూజలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 27వ రోజు శుక్రవారం కూడారై ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కూడారై ఉత్సవాన్ని పురస్కరించుకుని దిగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తులైన శ్రీప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వేకువ జామునే సుప్రభాత సేవతో మేలుకొలిపి దివ్య దర్శనం అనంతరం స్వామి అమ్మవార్లతో పాటు గోదాదేవి అమ్మవారికి నిత్యపూజలతో పాటు అర్చన, హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువుంచి నవకళ స్థాపన, అభిషేకం, పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామి, ఆండాల్ అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి కొలువుంచారు. ఆ తర్వాత అహోబిలం మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహదేశికన్ ఆధ్వర్యంలో 108 రకాల పాయసాలను ఉత్సవ మూర్తుల ఎదురుగా ఉంచి కూడారై ఉత్సవం నిర్వహించారు. ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. పూజలు ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సొమ్యానారాయణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



108 గంగాళాలతో 108 రకా పాయసాలు (ప్రసాదాలు) స్వామికి నివేదిస్తున్న పీఠాధిపతి



ప్రత్యేకాలంకరణలో గోదాదేవి అమ్మవారు

జొన్న అ'ధర'హో..!

- ఆశాజనకంగా దిగుబడులు
- మాలదండి రకం క్వింటా రూ. 3,225
- హైబ్రిడ్ రకం క్వింటా రూ.3,180
- జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో లక్ష ఎకరాల్లో సాగు
- రైతులకు కలిసొచ్చిన జొన్న సాగు
- ముమ్మరంగా జొన్న కోత, నూర్పిడి పనులు



కంపమల్ల సమీపంలో యంత్రం సాయంతో జొన్న పంట కోస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన జొన్న పంట రైతులకు అన్ని విధాలా కలిసొచ్చింది. విత్తనానికి ముందు సకాలంలో వర్షాలు కురియడం, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్‌కు నీరు విడుదల కావడం, పైరు వివిధ దశల్లో వాతావరణం అనుకూలంగా మారడంతో మంచి దిగుబడులు వస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్, రబీ సీజన్‌ల్లో హైబ్రీడ్, మహీంద్ర, పచ్చజొన్న రకాలకు సంబంధించి లక్ష ఎకరాల్లో రైతులు జొన్న పంట సాగు చేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 4,144 ఎకరాలు, దొర్నిపాడు మండలంలో 6,185, ఉయ్యాలవాడ మండలంలో 426, సంజామల మండలంలో 5,064, కొలిమిగుండ్ల మండలంలో 781, అవుకు మండలంలో 3,153 ఎకరాల్లో పచ్చజొన్న, హైబ్రిడ్, హైటెక్, మంజీర, సిదిసీడ్స్, మహేంద్ర, తదితర రకాలకు చెందిన జొన్న పంటను సాగు చేశారు. రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10 వేల నుంచి రూ. 12 వేలు వెచ్చించారు. వాతావరణం అనుకూలించి జొన్నలో కంకులు విరగ్గాసి ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు. పైరు వివిధ దశల్లో కత్తెర పురుగు ఆశించగా సకాలంలో గుర్తించి క్రిమి సంహారక మందులు పిచికారి చేసి పురుగును అదుపులోకి తెచ్చారు. పైరు కంకి దశలో ఉన్నప్పుడు పక్షులు కంకిపై వాలి జొన్న పిసుకుళ్లను తిని పంటకు నష్టం చేకూర్చకుండా వాటి బారి నుంచి పంటను రక్షించుకునేందుకు జొన్న పంట చుట్టూ మెరిసే రిబ్బన్లు అమర్చి కాపాడుకున్నారు. ఎండ, గాలికి రిబ్బన్లు మెరుస్తూ కదులుతుండటంతో పక్షులు పంటవైపు రాలేదు. కొత్త ఆలోచనతో జొన్న పంటను కాపాడుకోవడంతో మంచి దిగుబడులు వస్తున్నాయి. మహీంద్ర రకంలో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్లు, హైబ్రిడ్‌లో 16 నుంచి 20 క్వింటాళ్లు, పచ్చజొన్నలో 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడులు వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ మాలదండి రకం క్వింటా రూ.3,225, హైబ్రిడ్ రకం క్వింటా రూ.3,180 ధర పలుకుతోంది. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడులు పోనూ నికర ఆదాయం చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పైరు చేతికందటంతో కోత, నూర్పిడి పనుల్లో బిజీ అయ్యారు.



విక్రయించేందుకు జల్లెడ పడుతున్న కూలీలు

పచ్చజొన్నతో ఆదాయం



నాకున్న రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పచ్చజొన్న సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10 వేలు వెచ్చించాను. ఈ రకం దిగుబడి తక్కువైనా మార్కెట్‌లో ధర బాగుంటుంది. ఈ సారి వాతావరణం అనుకూలించి ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో క్వింటా రూ. 5,500 ధర ఉండటంతో ఇటీవలే దిగుబడులు విక్రయించాను. రూ. 60 వేలకు పైగా ఆదాయం వచ్చింది.

– వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

ఎస్సార్బీసీకి నీరిచ్చి ఆదుకున్నారు



ఈ ఏడాది జొన్న సాగుకు ముందే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఈ ఏడాది ఐదు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాను. విత్తనానికి ముందు వర్షాలు కురిసినా, తర్వాత వరుణుడు కరుణించలేదు. శ్రీశైలం జలాశయం నుంచి ఎస్సార్బీసీకి సకాలంలో నీటిని విడుదల చేయడంతో రెండు తడులు సాగునీరు మళ్లించుకున్నాను. ఎకరాకు 18 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో జొన్న సాగు అనుకూలించింది.

– గోవిందరెడ్డి, రైతు, గుంజలపాడు, కోవెలకుంట్ల మండలం

19 వేల ఎకరాల్లో జొన్న సాగు



కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో 19,756 ఎకరాల్లో రైతులు వివిధ రకాలకు చెందిన జొన్న పంట సాగు చేశారు. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10 వేల నుంచి రూ. 12 వేలు వెచ్చించారు. జొన్నలో మంచి దిగుబడులు రావడంతోపాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండటంతో రైతులకు లాభం చేకూరుతోంది.

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

పలు రైళ్లు పొడిగింపు

నంద్యాల(సిటీ): రైలు ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు డివిజన్ పరిధిలో పలు రైళ్లను పొడిగింపునకు అధికారులు ఏర్పాట్లు చేశారు. హుబ్లీ-విజయవాడల మధ్య తిరిగే 17226 రైలు నర్సాపూర్ వరకు, నంద్యాల-కడప మధ్య తిరిగే డెమో రైలు రేణి గుంట వరకు పొడిగింపును ఈశాన్య ప్రాంత సాంస్కృతిక, పర్యాటక శాఖాభివృద్ధి మంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్‌గా శనివారం ప్రారంభించారన్నారు. ఈ రైలు హుబ్లీ నుంచి మధ్యాహ్నం1.20కి బయలుదేరి నంద్యాలకు రాత్రి 9.10 చేరుకుని 9.15కి బయలుదేరి విజయవాడకు తెల్లవారు జామున 3.40కి చేరుకుని 3.50కి బయలుదేరి గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు మీదుగా నర్సాపూర్‌కు ఉదయం 7.40కి చేరుకుంటుంది. అలాగే నంద్యాల-కడప మధ్య తిరిగే డెమోను రేణిగుంట వరకు పొడిగిస్తూ ఈనెల 6వ తేదీన ప్రారంభించాల్సి ఉండగా అనివార్య కారణాల కార్యక్రమం వాయిదా పడింది. కాగా శనివారం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- డబ్లింగ్ పనుల నిమిత్తం ఈ నెల 22 వరకు రద్దు చేసిన గుంటూరు-కాచిగూడ 17251 నెంబర్ గల రైలు సంక్రాంతి సెలవుల దృష్ట్యా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల15వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు నంద్యాల రైల్వే స్టేషన్ మాస్టర్ దొరస్వామి పేర్కొన్నారు. కాచిగూడ నుంచి గుంటూరు వరకు తిరిగే 17252 రైలు ఈ నెల 16న కాచిగూడలో రాత్రి 9.20గంటల నుంచి ప్రారంభం కానుందన్నారు.
- గుంటూరు-తిరుపతి మధ్య తిరిగే 17261 ఎక్స్‌ప్రెస్ రైలు సంక్రాంతి సెలవులను దృష్టిలో ఉంచుకుని తిరుపతి రైలుకు అదనంగా 3 జనరల్ బోగీలను ఈ నెల 20వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్నామన్నారు.